క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ దంపతులు

గణపురం: మండల కేంద్రంలోని కోటగుళ్లలో ఎంపీడీఓ భాస్కర్‌అనసూయ దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జూపల్లి నాగరాజు వారికి తీర్థ ప్రసాదాలను అందించారు.

గ్రామ కమిటీ ఎన్నిక



గ్రామ కమిటీ సభ్యులతో నాయకులు

భూపాలపల్లి రూరల్: మండలంలోని నేరేడుపల్లి ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని గ్రామంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ రుద్రారపు రామచందర్ మాదిగ శుక్రవారం తెలిపారు. అధ్యక్షుడిగా పాన్నాల రాజు, ఉపాధ్యక్షులుగా జీడి నరేష్, పాన్నాల చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా కాల్వల సదయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ నోముల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థికి ఘన సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న రాజ్‌మహ్మద్

చిట్యాల: మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థి గొల్కొండ నిఖీల్ కౌశిక్ ఇటీవల వెల్లడైన ఈసెట్ ఫలితాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎండి.రాజ్‌మహ్మద్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై శ్రావన్‌కుమార్

చిట్యాల: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ఉమ్మనబోయిన తిరుపతి ఆరు నెలల క్రితం సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి ఎస్సై శ్రావన్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మారుతి

రేగొండ: మండలంలోని కనిపర్తి గ్రామానికి చెందిన సాదు కృష్ణవేణి తలలో రక్తం గడ్డ కట్టడంతో ఇటీవల ఆపరేషన్ చేశారు. కాగా మళ్లీ ఆస్పత్రికి వెళ్లి చూపించుకునే ఆర్థిక స్థోమత లేకపోవండతో జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి బాధితురాలికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశాడు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నారపు రాజు, నాయకులు ఆకుల ప్రతాప్, సాదు సలేందర్, వివేక్, గణేష్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి 'పొలంబాట'

భూపాలపల్లి రూరల్: రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ భూపాలపల్లి సర్కిల్ సేఫ్టీ ఆఫీసర్ డివిజినల్ ఇంజనీర్ వెంకటేశం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వంగిన పోల్స్‌లను, లూజ్ లైన్‌లను సరిచేస్తున్నామని, మధ్య స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు పొలంబాట కార్యక్రమం ద్వారా వంగిన పోల్స్‌లు 145, లూజ్ లైన్లు 73, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలు 33 మార్చడం జరిగిందని తెలిపారు. వ్యవసాయదారులు విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

పచ్చదనం.. ఆహ్లాదం

- రహదారులకు ఇరువైపులా కనువిందు చేస్తున్న చెట్లు
- సేదదీరుతున్న బాటసారులు



కొత్తపల్లిగోరి నుంచి సుల్తాన్‌పూర్ గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు

రేగొండ: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా పచ్చని చెట్లు స్వాగత తోరణాలుగా కనువిందు చేస్తున్నాయి. హరితహారంలో భాగంగా గత ప్రభుత్వంలో నాటిన మొక్కలు పెరిగి నేడు చెట్లుగా మారాయి. రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలల్లో ఏ ఊరికి వెళ్లినా రోడ్లకు ఇరువైపులా పచ్చని చెట్లు దర్శనమిస్తున్నాయి. వృక్షాలు స్వాగతం పలుకుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఆ దారి గుండా వెళ్లే బాటసారులు పచ్చని చెట్ల కింద సేద తీరుతున్నారు. 2014–15 ఏడాదిలో అప్పటి ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నాటి నుంచి ఉపాధిహామీ పథకం కింద మండల వ్యాప్తంగా రహదారుల వెంట మొక్కలు నాటుతూ వస్తున్నారు. ఉపాధి సిబ్బంది మొక్కలకు రక్షణ ఏర్పాటు చేసి నీటిని అందించి రక్షించారు. అప్పుడు నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా బాటసారులకు స్వాగతం పలుకుతూ నీడనిస్తున్నాయి. ముఖ్యంగా రేగొండ మండల కేంద్రం నుంచి రంగయ్యపల్లే, లింగా, కొడవటంచ, రేపాక, రాయపల్లె, కొత్తపల్లిగోరి మండల కేంద్రం నుంచి సుల్తాన్‌పూర్, జగ్గయ్యపేట, కొత్తపల్లె, చిన్నకోడేపాక గ్రామాల వెంట ఎటు చూసినా చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కానుగ, గుల్మోరా, గిన్నె, చీమ తంగేడు తదితర చెట్లు కనిపిస్తున్నాయి.

ఆహ్లాదకరంగా రహదారి



కొత్తపల్లిగోరి నుంచి రేగొండ మండలానికి వెళ్లే రహదారి వెంట ఏడేళ్ల క్రితం నాటిన మొక్కలు నేడు పెద్ద చెట్లుగా మారాయి. రెండు గ్రామాల మధ్య పచ్చని తోరణాన్ని తలపిస్తున్నాయి. రేగొండకు వెళ్తుంటే రహదారి వెంట పచ్చని పొలాలు, పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి.

– అప్పని కట్టస్వామి, కొత్తపల్లిగోరి

మొక్కలు పెంచాం..

రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా గతంలో మొక్కలు నాటాము. మొక్కలను మేకలు, పశువులు తినకుండా రక్షణగా ఏర్పాటు చేసి కాపాడాం. కాల్వల నీరు, పొలాల నీటిని పోసి మొక్కలను రక్షించాం. నేటు చెట్లుగా మారి నీడనిస్తున్నాయి.

– జామీర్ పాషా, ఏపీఓ, రేగొండ

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత



ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్న గ్రామస్తులు

మొగుళ్లపల్లి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన మండలంలోని బంగ్లాపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బంగ్లాపల్లి గ్రామ శివారులోని పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకొని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఆర్ఐ శివరామకృష్ణ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని తనిఖీ చేయగా ట్రాక్టర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఇసుక ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కుకు తరలించినట్లు ఆర్ఐ తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

భూపాలపల్లి రూరల్: ఆర్ఎంపీల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగ కుమారస్వామి తల్లి వంగ వెంకటమ్మ స్మారకార్థం మండలంలోని కొంపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన దేవ్ ఆస్పత్రి డాక్టర్ సాయి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటనారాయణ ఆధ్వర్యంలో కంటి, గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. 25మందికి కంటిలో పొరలు వచ్చినట్టుగా గుర్తించి వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయిస్తామని కుమారస్వామి తెలిపారు.ఈ శిబిరంలో రూ.60 వేల మందులు ఇచ్చినట్లు తెలిపారు. మూడు సంవత్సరాలుగా అతడి తల్లి పేరు మీద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న వంగ కుమారస్వామిని గ్రామ పెద్దలు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- గంట వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్న పోలీసులు



మహిళ మృతదేహం

గోవిందరావుపేట: మండలంలోని పస్రా రామాలయం వద్ద శుక్రవారం ఉదయం ఆటో ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. కాగా, ఢీకొట్టిన ఆటో పారిపోగా పోలీసులు గంట వ్యవధిలోనే పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పస్రా నాగారం నుంచి పస్రా ఆటో అడ్డా వైపు వస్తున్న ఆటో రామాలయం ముందు ఉన్న మహిళను ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే సమాచారం అందుకున్న పస్రా పోలీసులు ఆ మహిళ వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించి భద్రపరిచారు. సీసీ కెమెరాల సహాయంతో ఆక్సిడెంట్ చేసిన ఆటోని గంటలో గుర్తించి నిందితుడుని కస్టడీలోకి తీసుకున్నారు. నిందితుడిని కనిపెట్టిన హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీపతి, కానిస్టేబుల్స్ రతన్ సింగ్, మధులను ఎస్సై కమలాకర్ అభినందించారు. కాగా, మృతురాలికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిస్తే పస్రా పోలీసులకు 87126 70085, 87126 70986 నంబర్లకి సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ములుగు రూరల్: పరామర్శిస్తున్న మంత్రి సీతక్క



టేకుమట్ల: నివాళులర్పిస్తున్న నాయకులు

ములుగు రూరల్: మండల పరిధిలోని జగ్గన్నపేటకు చెందిన డిప్యూటీ తహసీల్దార్ కంది మహేశ్వ రెడ్డి తల్లి విజయలక్ష్మి మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని మంత్రి సీతక్క శుక్రవారం పరామర్శించి మహేశ్వరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లాడి రామ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, తదితరులు ఉన్నారు.

టేకుమట్ల: మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం భూపాలపల్లి బీజేయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు క్యాతం సతీష్, సామంతుల శ్యామ్ పరామర్శించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట చిట్యాల బీజేయూ మండల నాయకులు కాట్రేవుల ఐలయ్య, రవితేజ, కట్కూరి శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రామాలయం వీధిలోని ముత్యాలమ్మ తల్లి ఆలయ 9వ వార్షికోత్సవ పూజలను ఘనంగా నిర్వహించనున్నారు. శని, ఆదివారాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలతోపాటు బోనాల సమర్పించే కార్యక్రమం కలదని నేతాకని సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం తెల్లవారిజామున పెద్దపట్నంతోపాటు ఒగ్గుకథ కార్యక్రమం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నియామకం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని అన్నారం ఏరియా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా పలుగుల గ్రామానికి చెందిన నిట్టూరి సంతోష్‌ను నియమించినట్లు గ్రామ శాఖ అధ్యక్షుడు మానెం మహేష్ శుక్రవారం తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ మండల, జిల్లా నాయకులకు సంతోష్ కృతజ్ఞతలు తెలిపాడు.

నేడు సంస్మరణ సభ

టేకుమట్ల: మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి అలియాస్ గణేష్ ఈ నెల 18న ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. కాగా నేడు(శనివారం) వెలిశాలలో సంస్మరణ సభను నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మహేందర్



మురుగు నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్న సిబ్బంది

- వైద్యాధికారి మహేందర్

వాజేడు: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మహేందర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పూసూరు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 52 మందికి పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంతో ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. అంతకుముందు మండల పరిధిలోని గణపురం, గణపురం కాలనీ గ్రామాల్లో గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి మురుగు నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేశారు. బ్లీచింగ్, టీమోపాస్ మందును చల్లించారు. ఈ సదర్భంగా డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. దోమలను అరికడితే జ్వరాలు రాకుండా జాగ్రత్త పడవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ కోటిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశకార్యకర్తలు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



తీన్మార్ మల్లన్నకు వినతిప్రతం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): వాడబలిజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వాడ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు హైదరాబాద్‌లో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డర్రా దామోదర్ మాట్లాడుతూ.. బీసీ ఉద్యమానికి వాడబలిజ సేవా సంఘం పూర్తి మద్దతును ఇస్తుందని అన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో అనేక సంవత్సరాలుగా జీవిస్తున్న వాడ బలిజలు వివక్షతకు గురవుతున్నారని అన్నారు. 1/70 చట్టాన్ని తీసుకువచ్చి బీసీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చిన బీసీ జీవన స్థితిగతులు మారలేదని అన్నారు. మండలిలో వాడబలిజల సమస్యలపై చర్చించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట మల్లికార్జునరావు, గగ్గూరి రమణయ్య, విజయ్‌బాబు, ప్రసాద్, రాంబాబు ఉన్నారు.

మసీద్ కమిటీ అధ్యక్షుడిగా అఫ్జల్ పాషా



అఫ్జల్‌పాషాను సన్మానిస్తున్న ముస్లింలు

ఏటూరునాగారం: జామా మసీద్ నూతన కమిటీ అధ్యక్షుడిగా సయ్యద్ అఫ్జల్ పాషా గెలుపొందారు. శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన అధ్యక్షుడి ఎన్నికలో సిరాజ్, అఫ్జల్ పోటీ చేయగా ఓటింగ్ నిర్వహించారు. కాగా మొత్తం 298 మంది ముస్లింలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో సిరాజ్‌కు 129 రాగా, అఫ్జల్‌కు 169 ఓట్లు వచ్చాయి. దీంతో 42 ఓట్ల ఆధిక్యంతో అఫ్జల్ మసీదు కమిటీ అధ్యక్షుడిగా గెలుపొందారు. అనంతరం ముస్లిం పెద్దలు శాలువాతో సర్కరించి అభినందనలు తెలిపారు. అఫ్జల్ మాట్లాడుతూ.. మసీదు అభివృద్ధికి, ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్టు



పోలీస్ స్టేషన్‌లో కార్మికులు

వాజేడు : గ్రామ పంచాయతీ కార్మికుల తెలంగాణ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు చలో హైదరాబాద్ కార్యక్రమాని వెళ్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పంచాయతీ కమిషనరేట్ ముట్టడికి వెళ్లకుండా అరెస్టు చేసి అనంతరం వదిలేశారు.

ఎస్సైకి సన్మానం



ఏటూరునాగారం: మండల కేంద్రంలో స్థానిక ఎస్సై రాజ్‌కుమార్‌ను ధర్మ సమాజ్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి మండలంలోని స్థితిగతులను వివరించారు. ఈ కార్యక్రమంలో సురేష్, రాజశేఖర్, సంజీవ, నరేందర్, రాజు, సీతారామ్, వంశీ, తరుణ్, అజయ్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి, గోవిందరావుపేట, పస్రా, లక్నవరంలోని లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు అశోక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల, గ్రామ నాయకులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో దోపిడీ..

- ఇసుక వ్యాపారులకు కాసుల వర్షం
- అనుమతి పేరుతో అక్రమ రవాణా



గౌరారం అడవుల్లో డంప్ చేస్తున్న ఇసుక

గోవిందరావుపేట: ఇసుక వ్యాపారులకు ఇందిరమ్మ ఇళ్లు కాసులు కురిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇందిరమ్మ ఇళ్ల పేరుతో వే బిల్లు తీసుకోని దర్జాగా ఇసుక వ్యాపారం చేస్తున్నారు. ఒక్కో వే బిల్లుపై ఐదు ట్రిప్పులకు తక్కువ కాకుండా, ఒక్కోసారి ఒకే వే బిల్లు పై రోజంతా ఇసుకను అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుకను ప్రభుత్వం ఉచితంగానే ఇస్తున్నా ఇసుక వ్యాపారులు మాత్రం వేలాది రుపాయలు లబ్ధిదారుల వద్ద దండుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పైవరకు అమ్ముకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక పర్మిషన్ ఇవ్వడంతో ట్రాక్టర్ యజమానులకు అక్రమ రవాణాకు తెరలేపారు. పర్మిషన్ ఉంటే చాలు రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు పర్మిషన్ ఇచ్చి చేతులు దులుపుకోవడంతో ఇసుక రవాణా చేసే వారికి అడ్డు అదుపు లేకుండా పోయిందని తెలుపుతున్నారు. ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాల్సిన అధికారులకు ముందుగానే పలువురికి అడిగినంత ముడుపులు ముట్టజెప్పడంతో వారు చూసి చూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లోని ట్రాక్టర్ యజమానులంతా సిండికేట్‌గా ఏర్పడి గ్రామాభివృద్ధి కమిటీల సహకారంతో ఇసుక మాఫియాను అడ్డూ అదుపు లేకుండా నడిపిస్తున్నారు.

పేరుకే అనుమతులు..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులు తీసుకువచ్చిన ట్రాక్టర్లకు రోజుకు రెండు నుంచి నాలుగు ట్రిప్పులకు ఉదయం 10 నుంచి 5 గంటల వరకు సమయాన్ని కేటాయిస్తూ పర్మిషన్ ఇస్తున్నారు. కానీ, ట్రాక్టర్ యజమానులు పేరుకే అనుమతులు తీసుకొని నిబంధనలను తుంగలో తొక్కి రాత్రి వరకు ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని చల్వాయి, పస్రా తదితర గ్రామాలలో వట్టివాగు, గౌరారం, దయ్యాల వాగు, గుండ్లవాగు పరివాహక ప్రాంతాల నుంచి ఈ ఇసుక దందా సాగుతోంది. ఇసుకను తీసుకొచ్చి డంప్ చేస్తు ఇతర ప్రాంతాలకు కూడా తరలిస్తున్నారు. రాజకీయ పార్టీ నాయకులే ఇసుక వ్యాపారులుగా మారి రవాణా సాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని తెలుపుతున్నారు.

అక్రమంగా తరలిస్తే చర్యలు



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఇసుక పర్మిషన్ తీసుకున్న ట్రాక్టర్ యజమానులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు. ఇసుక అక్రమంగా తరలించి, ఇతరులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ట్రాక్టర్ల యజమానులపై నిరంతరం నిఘా ఉంటుంది.

– నెల్లుట్ల సృజన్ కుమార్, తహసీల్దార్

కబ్జాకు గురవుతున్న ఎర్రకుంట చెరువు



చదును చేసిన చెరువు

ఏటూరునాగారం: మండలంలోని ఆకులవారి ఘణపురం రెవెన్యూ గ్రామంలోని ఎర్రకుంట చెరువును కొంతమంది కబ్జాదారులు దున్ని చదును చేశారు. అయితే ఆయకట్టు ఉన్న రైతులు తెలుసుకొని అక్కడి వెళ్లే సరికి పారిపోయారు. ఎన్నో ఏళ్ల నాటి చెరువును కబ్జా చేయాలని చూస్తున్న వారిని గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను కోరుతున్నారు. ఇలానే నిర్లక్ష్యం చేస్తే వందలాది ఎకరాల చెరువు కబ్జాలోకి వెళ్లే ప్రమాదం ఉందని రైతులు కోరుతున్నారు.